
ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరుడు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 11 నవంబరు 2025

కార్తికం.. కమనీయం



ఆలయాలకు.. పోటెత్తిన భక్తులు ● వైభవంగా కార్తిక సోమవారం పూజలు

అమరావతి, కోటప్పకొండ (నరసరావుపేట), బాపట్ల రూరల్, పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. శివనామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. రోజంతా కొందరు మహిళలు ఉపవాస దీక్ష చేపట్టారు. పంచారామ క్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరావతిలోని అమరేశ్వరాలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తొలుత కృష్ణానదిలో స్నానమాచరించిన భక్తులు నదీతీరంలో, ఆలయ పరిసరాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం క్యూల్లో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. మేధా దక్షిణా మూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. ఆలయ ప్రాంగణం, నందీశ్వరుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శివయ్య దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. యజ్ఞాలబావి వద్ద స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేశారు. అనంతరం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకాని శివయ్యను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్ దంపతులు, విజయవాడ డీసీపీ కెజివి సరిత, గుంటూరు ఆర్డీవో శ్రీనివాస్ తదితరులు దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వరుడు

సముద్రుడికి తాంబూలం

బాపట్లలోని సూర్యలంక సముద్రతీరం తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడి నెలకొంది. తీరంలో మహిళలు, పురుషులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిన్నెలతో శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సముద్రదేవుడికి తాంబూలాన్ని సమర్పించారు.


అమరావతిలో భక్తుల పూజలు


బాపట్ల : సూర్యలంక తీరంలో భక్తుల స్నానాలు


గుంటూరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వాటర్ షెడ్ పర్యావరణానికి పునాది

- నీటి నిర్వహణతోనే దేశాభివృద్ధి
- జాతీయ సదస్సులో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- గుంటూరులో అట్టహాసంగా ప్రారంభమైన సదస్సు
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన అధికారులు, ఎన్‌జీవోలు
- వెంగళాయపాలెం చెరువు సందర్శనకు నేడు కేంద్ర మంత్రి చౌహాన్

నేడు వాటర్‌షెడ్ మహోత్సవ్ సభ

వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలో అభివృద్ధి చేసిన చెరువును మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సందర్శించనున్నారు. సోమవారం రాత్రి గుంటూరుకు చేరుకున్న ఆయన ఐటీసీ హోటల్‌లో బస చేశారు. ఆయన మంగళవారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారు లతో కలిసి వెంగళాయపాలెం చెరువుని సందర్శిస్తారు. అనంతరం లయోలా పాఠశాలలో జరిగే వాటర్ షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం జాతీయ వాటర్ షెడ్ సదస్సు ముగింపు కార్యక్రమం ఐటీసీ హోటల్‌లో జరుగుతుంది. సాయంత్రం పెమ్మసాని నివాసంలో డిన్నర్‌కి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరౌతారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, అధికారులు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ అంటే చెక్‌డ్యాం కాదని ఇది గ్రామీణ భారత పునర్నిర్మాణానికి బలమైన పర్యావరణ పునాది అని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల వాటర్‌షెడ్ జాతీయ సదస్సు గుంటూరులో ఐటీసీ వెల్‌కం హోటల్‌లో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్రం, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు, ఎన్‌జీవోలు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషికి అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయాలన్నారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వెంగళాయపాలెంలోని 21 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుని కేవలం రూ.కోటి ఖర్చు చేసి 15 రోజుల్లోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఆ చెరువుని మంగళవారం ఉదయం ప్రతినిధులంతా సందర్శించాలని కోరారు. దేశాభివృద్ధి నీటి నిర్వహణపై ఆధారపడి ఉందని, వర్షం వచ్చినప్పుడే ఆ నీటిని సేకరించి నిల్వ చేసుకుని ఆ తర్వాత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంట ఆదాయం పెరుగుతుందన్నారు. రెండో పంట సాగు చేసే అవకాశం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది ప్రారంభించబోయే వాటర్ డెవలప్‌మెంట్ కన్వర్జెన్స్ - పీకేఎస్‌వై 3.0ని ఏ విధంగా రాష్ట్రాలు (మిగతా 6వ పేజీలో)


వివిధ రాష్ట్రాల నుంచి సదస్సుకు హాజరైన అధికారులు

ఢిల్లీ ఘటనతో... రెడ్ అలర్ట్



- ఎక్కడికక్కడ అప్రమత్తమైన పోలీసులు
- హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా రెండు గంటల పాటు నాకాబందీ




గుంటూరు: నాకాబందీలో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు


గుంటూరు:రైల్వే స్టేషన్ వద్ద డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

నరసరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం బాంబు పేలుళ్ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు రెడ్‌అలర్ట్ ప్రకటించారు. ఐజీ, ఎస్పీలతో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్త అత్యవసరంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నాకాబందీ పేరుతో విస్తృత తనిఖీలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమ వారం రాత్రి 8:30 నుంచి 10:30 గంటల వరకు పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. రోడ్లపైనా, అన్ని ప్రధాన కూడళ్లలోనూ వాహన తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లతో పాటు జన సమర్థంగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లోనూ ఆయా తనిఖీలు కొనసాగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు ఇతర రవాణా వాహ నాలను ఆపి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించారు. ఆయా తనిఖీల్లో అనుమానాస్పద వ్యక్తులను పూర్తిస్థాయిలో విచారించి వారి ఆధారాలు పరిశీలించిన తర్వాతే వదిలేశారు. బాంబుడిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లు సైతం రంగంలో దిగి తనిఖీలు నిర్వహించాయి. మరోవైపు కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్ట్ నిఘా బృందాలు రంగంలో దిగి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆరాతీస్తున్నాయి.పోలీసులు అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో రంగంలోకి తనిఖీలు చేపట్టడంతో ఏం జరిగిందో అర్థం కాక వాహన చోదకులు ఆయోమయానికి గురయ్యారు. మరోవైపు ఆయా జిల్లాల్లో వీఐపీల కదలికలు ఉన్న ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టు దిట్టం చేశారు. ఇక జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ ఆకస్మిక తనిఖీలు కొనసాగాయి. గుంటూరు శివారు వెంగళాయపాలెంలో జరగనున్న జాతీయ వాటర్ షెడ్ మహోత్సవానికి కేంద్ర మంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆయా ప్రాంతాల్లో బందోబస్తును పటిష్ఠం చేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● గ్రామీణ బ్యాంక్ రుణ వితరణ సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఏపీ గ్రామీణ బ్యాంక్ రుణ వితరణ కార్యక్రమం సోమవారం తిమ్మాయపాలెం రోడ్డులోని వై.కన్వెన్షన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలకు ఒక సారి ప్రతి నియోజకవర్గంలో లబ్ధిదారుల వద్దకే బ్యాంక్‌లు వచ్చి రుణ వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ బ్యాంక్ రూ.20 కోట్ల రుణాలు అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. కేవలం నెల రోజుల్లోనే 300 మందికి రుణాలు ఇప్పించామన్నారు. సబ్సిడీతో పాటు తక్కువ వడ్డీకి బ్యాంకు లు ఇస్తున్న రుణాలతో ప్రైవేటు అప్పుల భారిన పడొద్దని సూచించారు. సొంత ఇల్లు ఉన్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని సబ్సిడీతో పాటు ఆర్థిక లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమం లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎల్‌డీఎం కేఎస్ రాంప్రసాద్, ఆర్ఎన్ జి.సోమేష్, గ్రామీణబ్యాంక్ రీజనల్ మేనేజర్ సుభాష్, కౌన్సిలర్ షకీలాబేగం, జనసేన నాయకుడు నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

బండారుపల్లి తీరుపై వ్యతిరేకత

అక్రమాలను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆగ్రహం ● సాతులూరులో టీడీపీ శ్రేణుల నిరసన

నాదెండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాదెండ్ల మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ వైఖరిని పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. అక్రమాల గురించి ప్రశ్నిస్తే సొంత పార్టీ వారని కూడా చూడకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఆయన తీరును తప్పు పడుతూ సొంత గ్రామమైన సాతులూరులో ఆదివారం రాత్రి పలువురు నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవూరుకు చెందిన పలువురు మాట్లాడుతూ గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మెజారిటీ కోసం తాము కృషి చేసినా ఒక్క హామీని కూడా నెరవేర్చకపోగా సత్యనారాయణ ఆయన అనుచరుల వైఖరి వలన సాతులూరుకు చెడ్డపేరు వచ్చిందన్నారు. తప్పుడు కేసులు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. పార్టీకోసం కష్టపడిన వారిని అణగదొక్కే ప్రయత్నంలో భాగంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సమస్యలపై ఎమ్మెల్యే, ఎంపీలను కలుస్తామని వారు స్పందించకపోతే లోకేశ్, చంద్రబాబులను కలుస్తామన్నారు. పెద్దవూరు వరకే ప్రత్యేకంగా పార్టీ ఆఫీసు ఏర్పాటు చేసుకుని గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఉపసర్పంచ్ శరభయ్య, మాజీ సర్పంచ్ వెంకటరమణ, మాజీ టీడీపీ అధ్యక్షుడు నార్నె సాంబయ్య, వై యల్లమందయ్య, నర్రా బుజ్జి, వేజెండ్ల శివకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మనోజ్, నాగసురేంద్ర, నాగబాబు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


సాతులూరులో సమావేశమైన నాయకులు, కార్యకర్తలు

ఎంఎస్‌ఎంఈలకు నేడు శంకుస్థాపన

- రూ.24 కోట్లు పెట్టుబడులు.. 29.91 ఎకరాల్లో పరిశ్రమలు
- వర్చువల్‌గా నేడు కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

నకరికల్లు, నరసరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నకరికల్లు మండలం గుండ్లపల్లి, దాచేపల్లి మండలం నడికూడిల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈలకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా హాజరై శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారని కలెక్టర్ కృతికాశుక్లా సోమవారం తెలిపారు. 29.91 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు రూ.24 కోట్లు పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. గుండ్లపల్లి వద్ద పరిశ్రమల ఏర్పాటుకు 27 ఎకరాలు, నడికూడి వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు 2.91 ఎకరాలు కేటాయించామన్నారు. కార్య క్రమాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.


ప్రారంభోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో

కాగా గుండ్లపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు శంకుస్థాపనకు సంబంధించి సోమవారం ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, ఏపీఐఐసీ అధికారులు పరిశీలించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం యంగ్‌బుల్ రేరింగ్ సెంటర్ స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని ఏపీఐఐసీకి అప్పగించగా ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఏర్పాట్లను ఆర్డీవోతో కలిసి తహసీల్దారు కట్టికోట పుల్లారావు, డీటీ తుమ్మా కొండారెడ్డి, ఆర్ఐ తోట సిద్ధయ్య, ఏపీఐఐసీ ఇంజనీర్లు మేకల సుధీర్, అనూష తదితరులు పరిశీలించారు.

గురజాలలోనే తొలి సీసీఐ కేంద్రం

● మరో వారంలో జిల్లా వ్యాప్తంగా ప్రారంభం
● పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి కేంద్రాల ప్రారంభోత్సవంలో కలెక్టర్

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 11 సీసీఐ కొనుగోలు కేంద్రాలు మంజూరు కాగా తొలిగా గురజాల నియోజకవర్గంలోనే ప్రారంభించినట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటిసారిగా పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, గురజాలలో ప్రారంభమవుతున్నాయని, మిగిలినవి వారం రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. పల్నాడులో పత్తి ముందుగా వస్తుందని, తర్వాత చిలకలూరిపేట వైపు కొనుగోళ్లు ప్రారంభమవుతా యన్నారు. రైతులు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని స్లాట్ బుక్ చేసు కున్న తర్వాత ఏ కొనుగోలు కేంద్రానికి, ఏ సమయానికి వెళ్లాలో వారి ఫోన్‌కే మెసేజ్ వస్తుందన్నారు. రైతులు పండించిన చివరి పత్తి వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే యరపతి నేని మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా పంట మార్పిడి చేయాలన్నారు. ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడులో పం డించే మిరపకు ఆసియా ఖండంలోనే మంచి పేరుందని చెప్పా రు. దాచేపల్లిలో మిర్చి కొనుగోలు కేంద్రాల వల్ల పల్నాడు రైతులు గుంటూరుకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పిందన్నారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలోని ఓ గ్రామంలో రైతులు కమిటీగా ఏర్పడి చేస్తోన్న సాగు విధానం అద్భుతంగా ఉందని నియోజకవర్గంలోని రైతులు, వ్యవసాయ అధికారులతో కలిసి అక్కడకు వెళ్లి అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్లు తురకా వీరస్వామి, బెల్లంకొండ భారతిభద్రి, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, వున్నం ఆంజనేయులు, పాదర్తి రాజేశ్వరి, మార్కెటింగ్‌శాఖ జేడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో వాణి, చల్లగుండ్ల సీత, కొంకా రాధ, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శులు ఈశ్వరరావు, నూరె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు పుష్కర ఘాట్ వద్ద ఆదివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తెలంగాణలోని హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన ముజాహిద్దీన్ తన స్నేహితులతో కలసి పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వచ్చాడు. మాదిపాడులోని పుష్కర ఘాట్ వద్ద స్నానాలు చేస్తుండగా కాలు జారి నదిలో పడి గల్లంతయ్యాడు. ముజాహిద్దీన్ మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


చింతకాయల వెంకట్రావు (ఫైల్ ఫొటో)

యడ్లపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వృద్ధ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం, కొత్తపాలెం గ్రామానికి చెందిన చింతకాయల వెంకట్రావు (72) ఏటా పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తుంటాడు. పెట్టుబడుల కోసం రూ.11లక్షల వరకు అప్పు చేశాడు. ఈ ఏడాది కూడా కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసినప్పటికీ ఆశాజనకంగా లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. గత కొన్నేళ్లుగా దిగుబడులు రాక వరుస నష్టాలు వస్తుండడం.. అప్పులు తీర్చలేనేమోనన్న భయంతో తల్లడిల్లిపోయాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న కొత్తపాలెం గ్రామ శివారులో పురుగుల మందు తాగి చిన్న కుమారుడు లక్ష్మీనారాయణకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన వెంకట్రావును గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అటు నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 8న వెంకట్రావు మృతిచెందాడు. వెంకట్రావు పెద్ద కుమారుడు గోపి సోమవారం యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సూర్యప్రకాశ్ (ఫైల్ ఫొటో)

కొల్లిపర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లిపర మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం గ్రామానికి చెందిన కె.సూర్యప్రకాశ్ (44) పనిమీద విశాఖపట్టణంలోని గాజువాకకు వెళ్లాడు. ఆదివారం సూర్యప్రకాశ్ గాజువాకలో జాతీయ రహదారిపై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. దాంతో సూర్యప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సోమవారం పోలీసులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. సూర్యప్రకాష్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. అతడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

కాలువలో పడి విద్యార్థిని మృతి


నరసమ్మ (ఫైల్ ఫొటో)

ఈపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలవలోకి జారి పడి ఏడో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన ఈపూరు మండలంలోని ఇనుమెల్లలో సోమవారం జరిగింది. భద్రపాలెం గ్రామానికి చెందిన గండికోట సుబ్బారావు, మల్లేశ్వరి దంపతుల చిన్న కుమార్తె నరసమ్మ (12) ఇనుమెల్ల హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాల విడిచి పెట్టిన తర్వాత ఇంటికి వచ్చే క్రమంలో బస్సు కోసం మేజర్ కాలువ వద్ద దిమ్మెలపై కూర్చుంది. దాహం వేయ డంతో బాటిల్‌తో నీళ్లు తీసుకోవడానికి కాలువలోకి దిగింది. ఈ క్రమంలో కాలుజారి కాలువలో పడి గల్లంతయింది. ఆ సమయంలో అక్కడే దుస్తులు ఉతుకుతున్న ఓ మహిళ నరసమ్మను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతయిన నరసమ్మ కోసం గాలింపు చేపట్టగా కొంత దూరంలో ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నరసమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఐకమత్యంతోనే అద్భుత విజయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలి
- అడిగొప్పుల నేతల పనితీరు భేష్
- నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

దుర్గి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఐకమత్యంతో అద్భుత విజయం సాధించామని, అందరూ కలిసిమెలిసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరంలో హరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఎడ్లబండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా సంతోషంగా ఎడ్లపోటీలకు హాజరవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఎక్కడ చూసినా పల్లెలు పశువులతో కళకళలాడేవని, పశు సంపదను ముందు తరాలకు అందించేలా ఎడ్ల పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు అనుకూలంగా ఉన్నాయని, మిర్చి, పత్తి, కంది ధరలు ఆశాజనకంగా ఉండడంలో కూటమి ప్రభుత్వం కృషి ఉందన్నారు. గతంలో ఎన్నో ప్రాజెక్టులు మూలనపడ్డాయని, వాటికి జీవం పోసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేయకుండా గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. అడిగొప్పుల గ్రామ కూటమి నేతలు గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చే స్తుందని లావు కృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, కుర్రి శివారెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, బూసా రామాంజనేయులు, జానకి రామయ్య, వజ్రం నాయక్, దిగుమర్తి సుబ్బారావు, మేకల దాసు, యాగంటి నరేశ్, తోటకూర శ్రీనివాసరావు, సింగు నాగేశ్వరరావు, జక్కా రమేశ్, వంకమళ్ల కోటేశ్వరరావు, వెలిదండి శ్రీనివాసరావు, నాగెండ్ల శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

చిక్కీలో పురుగులు

- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

చుండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చుండూరు మండల ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు ఇస్తున్న చిక్కీ ప్యాకెట్లలో నుంచి పురుగులు బయటకు వస్తున్నా అధికారులు వాటిని పాఠశాలలకు పంపిణీ చేశారు. సోమవారం ఆలపాడులోని 1వ వార్డు ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న పాప పాఠశాలలో ఇచ్చిన చిక్కీని సాయంత్రం ఇంటికి తెచ్చుకొంది. చిక్కీ కవర్ చించమని తండ్రిని కోరింది. ఆయన కవర్ చించగా చిక్కీ నుంచి పురుగులు బయటకు వచ్చాయి. మండలంలోని 32 ప్రాథమిక పాఠశాలలకు ఇటీవల ఈ చిక్కీలను పంపిణీ చేశారు. విద్యార్థులు పురుగులు ఉన్న చిక్కీలను గుర్తించక వాటిని తిని ఉంటారని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి చుండూరు మండలంలోని పాఠశాలల పనితీరును పరిశీలించి రెండు సంవత్సరాలకు పైగా అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల వ్యక్తిగత పర్యవేక్షణ కనిపించడం లేదని అందువల్లే చాలా మంది తల్లిదండ్రులు ఇంటి నుంచి పిల్లలకు క్యారేజీలు ఇచ్చి పంపుతున్నారని తెలుపుతున్నారు. నానాటికి ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు విడిచి ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరుతున్నారని చెబుతున్నారు. ఒక్కసారైన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అవకతవకలపై జిల్లా విద్యాశాఖాధికారి వ్యక్తిగతంగా పరిశీలించాలని కోరుతున్నారు. పురుగుల చిక్కీలను అందించిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక మోసాల నివారణపై ఏఎన్‌యూలో సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలను అధిగమించడంపై మంగళవారం ఏఎన్‌యూలో ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నామని సోమవారం కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ఆర్.శివరాం ప్రసాద్ తెలిపారు. ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఏఎన్‌యూ ఆధ్వర్యంలో సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ ఆర్థిక మోసాలు, పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ పరిస్థితుల గురించి ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఏఎన్‌యూలోని బాలమోహన్ దాస్ సెమినార్ హాల్లో ఈ సదస్సు జరుగుతుందని శివరాం తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తుళ్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణానదిలో ఆదివారం గల్లంతైన ఇద్దరిలో నాగులపల్లి పవన్ (29) అనే యువకుడి మృతదేహం లభ్యమైంది. స్నానానికి దిగిన కొద్ది దూరంలో పవన్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లు వెలికి తీశారు. మృతుడు కోనసీమ జిల్లా అమరాపురం వాసి, రాజధానిలో హ్యాపి నెస్ట్ నిర్మాణం చేపట్టిన ఎన్‌సీసీ కంపెనీ స్టోర్‌లో పనిచేస్తున్నాడు. గల్లంతైన మరో యువకుడు దినేశ్ ఆచూకి ఇంకా లభించలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి.

కాలువలో స్నానానికి దిగి యువకుడి గల్లంతు


కుంచాల ఏసుబాబు (ఫైల్‌ఫొటో)

మంగళగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీ సమీపంలోని గుంటూరు చానల్‌లో స్నానానికి దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. తాడేపల్లికి చెందిన కుంచాల ఏసుబాబు (22) తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటూ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భవానీ మాల వేసుకున్న ఏసుబాబు లక్ష్మీనరసింహస్వామి కాలనీలో పనికి వచ్చాడు. తన మిత్రుడైన సహచర భవానీ శేషయ్యతో కలిసి గుంటూరు చానల్‌లో స్నానానికి దిగాడు. నీటి పారుదల ఎక్కువగా ఉండడంతో ఏసుబాబు నీటి ఒరవడికి కొట్టుకుపోయాడు. ఏసుబాబును రక్షించేందుకు శేషయ్య ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతయిన ఏసుబాబు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

చంద్రబాబు విజన్ వల్లే పారిశ్రామిక విప్లవం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, సమర్థత వల్లే ఏపీలో పారిశ్రామిక విప్లవం మొదలైందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలతో పాటు, గతంలో పరిశ్రమల్ని తరిమేసిన రాజకీయ భూతం మరలా రాదన్న ముఖ్యమంత్రి భరోసా పారిశ్రామిక వేత్తల్ని ధైర్యంగా రాష్ట్రం వైపు ముందడుగు వేయిస్తోందన్నారు. 410 ఒప్పందాలు, రూ 9.80 లక్షల పెట్టుబడులతో విశాఖ భాగస్వామ్య సదస్సు సాక్షిగా నవ్యాంధ్రప్రదేశ్ పేరు ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా ప్రపంచాన్ని చుట్టేస్తున్నా రని అన్నారు. సుదీర్ఘ సముద్రతీరం, మానవనైపుణ్యాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ పాలసీ కూటమి ప్రభుత్వ సత్వర స్పందన పారిశ్రామి కవేత్తలను ఆకర్షిస్తున్నామని కొమ్మాలపాటి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

సీఐఐ సమ్మిట్‌కు ఏపీ సీఆర్‌డీఏ ప్రతినిధులు

- అమరావతిలో పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రదర్శన

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) బృందం నవంబరు 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025లో పాల్గొంటుందని కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. సోమవారం రాయపూడి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ప్రముఖ సంస్థల సీఈవోలు, డెవలపర్లు, విద్యా, వైద్యా, ఎలక్ట్రానిక్స్, మౌలిక వసతుల సంస్థలకు అమరావతి రాజధాని ప్రాంతంలో పెట్టుబడికి ఉన్న అవకాశాలను ఏపీ సీఆర్‌డీఏ బృందం విస్తృతంగా వివరిస్తుందని చెప్పారు. సమ్మిట్‌లో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, లాజిస్టిక్స్, మొబిలిటీ, హరిత ఇంధనం వంటి పలు విభాగాల అభివృద్ధి క్లస్టర్లను ఏపీ సీఆర్‌డీఏ ప్రతినిధి బృందం ప్రదర్శించనుందని చెప్పారు. పెట్టుబడిదారుల కోసం పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు, వ్యూహాత్మకంగా ఉన్న భూభాగాలు, అమరావతిలో నిర్మిస్తున్న 9 థీమ్ సిటీల గురించి వివరించనుందని చెప్పారు. అలాగే ఏపీసీఆర్‌డీఏ అందిస్తున్న సౌకర్యాలు, పెట్టుబడిదారుల కోసం అవలంబిస్తున్న విధానాలను ఈ సమ్మిట్‌లో ఏపీ సీఆర్‌డీఏ బృందం ప్రదర్శిం చనుందని కమిషనర్ కన్నబాబు తెలిపారు.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులు సురక్షితం

రాజుపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం రెడ్డిగూడెం సమీపంలో హైదరాబాద్ నుంచి బాపట్ల వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కల్వర్టు వద్ద అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. రెడ్డిగూడెం సమీపంలో ఉన్న చప్టా వద్దకు బస్సు వచ్చే సమయానికి బస్సును డ్రైవర్ అతి వేగంగా నడపడం వల్ల రోడ్డు మార్జిన్‌లోకి దిగి బస్సు పక్కకు ఒరిగిపోయింది. పక్కనే ఉన్న సిమెంట్ పైపుల సపోర్టుతో బస్సు కింద పడకుండా ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.


అదుపుతప్పి పక్కకు ఒరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

4 స్టార్ హోటల్‌కు నేడు భూమి పూజ

- వర్చువల్‌గా పాల్గొననున్న సీఎం చంద్రబాబు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హోటళ్ల సంస్థ దసపల్లా గ్రూపు రాజధాని అమరావతిలో నిర్మించ తలపెట్టిన 4 స్టార్ హోటల్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేయనుంది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొని శుభాకాంక్షలు చెప్పనున్నారు. పురపాలక మంత్రి పి.నారాయణ, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. శాఖమూరు రెవెన్యూ పరిధిలోని ఎన్జీవో క్వార్టర్స్ సమీపంలో దసపల్లా గ్రూపు ఛైర్మన్ ఎం.రాఘవేంద్ర రావు చేతుల మీదగా ఈ భూమిపూజ జరగనుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

42,823 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,605 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,823 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,346 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	16200	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14300	334	10500	16000
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	16800	273	----	---
4884	----	---	341	10000	17000
సూపర్ 10	---	----	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16500
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	-----	----	తాలుకాయలు	5000	8800

ఎంఎస్కే క్రికెట్ అకాడమీకి భూమిపూజ


ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంఎస్కే ప్రసాద్ కుటుంబసభ్యులు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని పిచుకలపాలెం రెవెన్యూలో 12 ఎకరాలలో నిర్మించనున్న ఎంఎస్కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణా నికి సోమవారం భూమి పూజ జరిగింది. భూమి పూజలో భారత మాజీ క్రికెటర్ ఎంఎస్కే ప్రసాద్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ అకాడమీ రూపుదిద్దుకోనుంది. ఈ అకాడమీలో 400 మంది శిక్షణార్థులు, 1,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా నిర్మించనున్నారు. సందర్శక జట్ల కోసం వసతి, హాస్టల్ సౌకర్యాలు స్థానికంగా టోర్నమెంట్ల నిర్వహణకు మినీ క్రికెట్ స్టేడియం, అత్యాధునిక జిమ్‌లు, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రం ఆధునిక ఫిట్‌నెస్, కండిషనింగ్ సదుపాయాలతో ఈ అకాడమీని నిర్మిస్తున్నారు. అమరావతిని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఆర్డీఏ ఈ అకాడమీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోంది.

వాటర్‌షెడ్.. పర్యావరణానికి పునాది

(5వ పేజీ తరువాయి)

అమలు చేసుకుంటాయనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. రాజస్థాన్‌లో అభివృద్ధి చేసిన సరోవరం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జాన్సీలో వాటర్‌షెడ్ కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన నీటి వనరులను ప్రతీ ఒక్కరూ సందర్శించి స్ఫూర్తి పొందాలని అధికారులు సూచించారు. ల్యాండ్ స్కేపింగ్, వనరుల పరిరక్షణ ద్వారా పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ గురించి ఇక్రిశాట్ సంస్థ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందర్నీ ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జాన్సీ జిల్లాకు చెందిన ఇక్రిశాట్ టీమ్ లీడర్ డాక్టర్ రమేష్ సింగ్ దీని గురించి వివరించారు. సాంప్రదాయ నీటి పొదుపు విధానాల గురించి న్యూఢిల్లీకి చెందిన అంతర్జాతీయ నీటి యాజమాన్య సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ గోపాల్‌కుమార్ విశ్లేషించారు. నదులు, సాంప్రదాయ నీటి సంరక్షణ విధానాల పునరుద్ధరణ, పర్వతశ్రేణుల్లో నీటి బుగ్గల పునరుద్ధరణ, గడ్డి మైదానాల అభివృద్ధి, వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అమలులో హైడ్రాలజీ ప్లానింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవోఎల్ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ నితిన్ ఖడే, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణ తేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా నమూనా

సదస్సులో భాగంగా ఐటీసీ హోటల్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్‌షెడ్ 3డీ నమూనా ఏర్పాటు చేసింది. పచ్చని సోయగాల నడుమ, సరోవరం నుంచి నీరు జాలువారుతున్నట్లు రూపొందించిన ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్, ప్రజలకు నడక మార్గాలు వంటివి ఇందులో పొందుపరిచారు.

నేడు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

పిడుగురాళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా టీడీపీ గ్రామ, పట్టణ, మండల కమిటీల సభ్యులు ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం మార్కెట్‌యార్డు ఆవరణలో జరుగనున్నదని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి కొల్లి కోటేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని అధ్యక్షతన ప్రమాణస్వీకారం జరుగనున్నదన్నారు.

పౌష్టికాహారం అందజేత

సత్తెనపల్లి రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాగులూరి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఫణిదం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మీనా అన్నారు. మండలంలోని ఫణిదం పీహెచ్‌సీలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ ఆర్‌ఐ మాగులూరి భానుప్రకాష్ సహకారంతో పీహెచ్‌సీకి వచ్చే గర్భిణీలకు సోమవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అసిస్టెంట్ జీ నరసింహారావు, ఫౌండేషన్ ప్రతినిధులు కుంచనపల్లి కిరణ్, కుంచనపల్లి నాగమల్లేశ్వరి ఉన్నారు.

● పెదకూరపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్య వంతంగా ఉండాలనే ఉద్దేశంతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు అన్నారు. పెదకూరపాడులో పీహెచ్‌సీలోని మండలంలోని 75 తాళ్ళూరు పీహెచ్‌సీలో సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

రేపు తలనీలాలకు వేలం

మాచర్ల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతల శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో తలనీలాలు ప్రోదు చేసుకునే హక్కులకు ఈనెల 12వ తేదీన మాచర్లలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. డిసెంబరు 2వ తేదీ నుంచి 8 రోజులపాటు హక్కులకు ఈ వేలం జరపనున్నారు.

దీక్షాధారులకు సద్ది

క్రోసూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని దొడ్లేరులో అయ్యప్ప దీక్షా ధారులకు సద్ది కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సుమారు 400మంది సద్దిని స్వీకరించారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం ఘనంగా జరిగింది.

సీపీ బ్రౌన్ జయంతి

రెంటచింతల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుకు వెలుగును తెచ్చిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి వేడుకలను రెంటచింతల గిరిజన సంక్షేమ గురుకులంలో సోమవారం నిర్వహించారు. తొలుత బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ మాట్లాడుతూ బ్రౌన్ కృషి వల్ల తెలుగు భాష ఆధునిక రూపం దాల్చి వెలుగొందుతుందన్నారు. తెలుగు నిఘంటువు రావడం ఆయన చలవేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ భాగ్య మేరి పాల్గొన్నారు.

వీఆర్వో నాగేశ్వరరావుకు సన్మానం

మాచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా సైక్లోన్ సమయంలో ప్రజలకు విశేషంగా సేవలందించిన పట్టణ వీఆర్వో అరుమూళ్ల నాగేశ్వరరావు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు నాగేశ్వరరావును సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వరికపూడిశెలను పూర్తి చేయాలి

కారంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ ప్రజల కలగా ఉన్న వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేయాలని వరికపూడిశెల సాధన సమితి, సీపీఐ, ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోయే బడ్జెట్ సమావేశాల్లో వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ రాష్ట్ర కమిటి సభ్యుడు అబ్రహం లింకన్, సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా, బత్తుల వీరయ్య, కొక్కెర సురేష్, దొంతా అంజి, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పొందుగుల శ్రీను, చిలుకూరి రవీంద్రారెడ్డి, సూరే హనుమంతురావు, కోటిరెడ్డి, శశిదేవి, నాగమణి, గురజాల అప్పారావు, తూము శ్రీనివాస్, నూనె వెంకటేశ్వరరావు, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఒంటేరు పోలయ్య, చల్లంచర్ల రౌద్రయ్య, గాలం శ్రీనివాస్, మణి, తండా సైదాబి, షేక్ మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

బెల్లంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు సోమవారంతో ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపల్ కవిత పేర్కొన్నారు. చివరి రోజున ముఖ్య అతిథిగా పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్ మాట్లాడుతూ న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గత పది రోజుల నుంచి శ్రమదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మీ సులోచన, ఉపాధ్యాయులు రత్నకుమారి, వై రమేష్‌బాబు, కుసుమకుమారి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో నష్ట నివారణ

● జిల్లా ఏరువాక కో-ఆర్డినేటర్ నగేష్

క్రోసూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో పత్తి, మిర్చి, మాగాణి పంటల్లో తెగుళ్ళ ఉధృతి గమనించామని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టనివారణ చేసుకోవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త ఎం నగేష్ అన్నారు. సోమవారం సబ్ డివిజన్ పరిధిలోని ఆయా పంటలను పరిశీలించిన అనంతరం పీసపాడు ఆర్‌బీకేలో ఆయన రైతులతో మాట్లాడారు. పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించటం జరిగిందన్నారు. మిర్చిపంటలో వివిధ రకాల తెగుళ్ళు ఆశించాయన్నారు. వీటి నివారణకు అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ, ఏవో వేణుగోపాల్, అచ్చంపేట ఏవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై సూచనలు

అచ్చంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో అక్కడక్కడ గులాబీ రంగు పురుగును గమనించినట్టు ఏరువాక కేంద్రం నరసరావుపేట కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్, శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్ తెలిపారు. సోమవారం మండలంలోని కోగంటివారిపాలెం, రుద్రవరం, ఓర్వకల్లు గ్రామాల్లో పత్తి, మిరప, వరిపైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వీరితో పాటు మండల వ్యవసాయ అధికారి పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేట: పత్తి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు నగేష్, సత్యగోపాల్

బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మాచవరం: మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

మాచవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలం మోర్జంపాడు శివారులోని కృష్ణానది సమీపంలో అతి పురాతన బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే దేవాలయానికి చేరుకొని అభిషేకాలు నిర్వహించారు. బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అన్ని దేవాతామూర్తుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పురాతన దేవాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇప్పటికే దేవాలయానికి కావాల్సిన కొన్ని మౌలిక వసతులు కల్పించామని, దేవాలయానికి రోడ్డుమార్గం, విద్యుత్‌సౌకర్యం, మంచినీరు వంటి వసతులు కల్పించామన్నారు. తొలుత అర్చకులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

దాచేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి.. ఫ్యాక్షన్ రాజకీయాలు ఉండకూడదు.. అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్తీక సోమవారం సందర్భంగా దాచేపల్లి నగర పంచాయతీలో శ్రీవీర్లంకమ్మ తల్లి ఆలయంలో కోటి దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా అష్టమూర్తుల దేవతా విగ్రహాలకు పూజలు, కల్యాణాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దైద అమరలింగేశ్వర స్వామి, మోర్జంపాడులోని బుగ్గమల్లేశ్వరస్వామి, గుత్తికొండలో గుహలు, దాచేపల్లి శ్రీ వీర్లంకమ్మ తల్లి దేవాలయాలను అభివృద్ధి చేసి టూరిజం కేంద్రాలుగా తయారు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యలమల నరేష్‌ను సన్మానించారు. కొప్పుల గిరి ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీను, బద్రి, మునగ నిమ్మయ్య, బొమ్మిరెడ్డి నారాయణ, అహమద, పగడాల భాస్కరరావు, వేముల తిరుమలకుమార్, రుద్రాదల అచ్చరావు, తోట వెంకటేశ్వర్లు, కల్లూరు రాఘవ, సొసైటీ నారాయణ, నర్రా పుల్లయ్య, ఐనాల శ్రీరాములు, బత్తుల రాంబాబు, పాముల కిషోర్, కొప్పుల నాగేశ్వరరావు, బత్తుల రాంబాబు, బుర్రి సురేష్, వెలిశెట్టి అప్పారావు, హఫీజ్, ఎంపీటీసీ వలి తదితరులు ఉన్నారు.



దాచేపల్లి: అంకమ్మ తల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు నరేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం



మాచవరంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కార్తికమాస పూజలు నిర్వహిస్తున్న మహిళలు



గురజాల: దైద శివాలయం వద్ద కిటకిటలాడుతున్న భక్తులు

మాచవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో, మాచవరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పిన్నెల్లి, మల్లవోలు, పిల్లుట్ల తదితర గ్రామాల్లో మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నగర సంకీర్తన చేపట్టారు.

కిటకిటలాడిన శివాలయాలు

గురజాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం మూడో సోమవారం కావడంతో మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని దైద శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి బిలంలోని అమరలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అసౌకర్యాలు కలగకుండా ఈవో పూర్ణచంద్రరావు చర్యలు తీసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ భాస్కర్, ఎస్‌ఐ వినోద్‌కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం క్రోసూరు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రోసూరులోని పురాతన మల్లికార్జునస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచే వందల సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉసిరిక, మారేడు చెట్ల వద్ద దీపారాధనలు చేశారు. స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మండలంలోని దొడ్లేరు, 88 తాళ్ళూరు, పీసపాడు, బాలెమర్రు, ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలు సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.



క్రోసూరు శివాలయంలో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

సత్రశాలలో..

రెంటచింతల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారంతో కృష్ణానది ఒడ్డున సత్రశాల పుణ్యక్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. పల్నాడులోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వార్లకు పూజలు నిర్వహించారు. 1800 మందికి అన్నదానం చేసిన శ్రీరామదాసు వెంకట వీరబ్రహ్మం, సుబాషిణి, శ్రీరామదాసు శ్రీనివాసాచారి, మాధవి, శ్రీరామదాసు నరసింహయ్య, భార్గవి దంపతులను ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జీవీ శివయ్య, మెంబర్లు ఘనంగా సత్కరించారు.

వాగులో పడిన కారు

● తృటిలో తప్పిన పెను ప్రమాదం

దాచేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న సిగ్నల్స్ స్తంభాలను ఢీకొట్టి పక్కనే వాగులో పడిన సంఘటన సోమవారం దాచేపల్లి మండలం సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలోని రాళ్ళవాగు వద్ద జరిగింది. సోమవారం ఉదయం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కారులోని ప్రయాణీకులకు మాత్రం కాళ్ళకు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెపుతున్నారు.

భార్యపై గొడ్డలితో దాడి

దుర్గి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని ధర్మవరంలో జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నాగెండ్ల చిన్ననాగేష్ ఈనెల 8వ తేదీన రాత్రి మద్యం మత్తులో భార్య మరియమ్మ ముక్కుపై గొడ్డలితో దాడి చేశారు. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మరయమ్మను నిద్రలేపి ఆమెతో ఘర్షణకు దిగి గొడ్డలితో దాడి చేశాడు. మరియమ్మను 108 లో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై దుర్గి ఎస్‌ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

పిడుగురాళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డు వద్దగల సితార రెస్టారెంట్ వెనుకవైపు గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. తురకా ఆంజనేయులు సాగు చేసుకుంటున్న పొలం పక్కన వున్న పోరంబోకు స్థలంలో మృతదేహం వున్నట్లు తెలుసుకున్న ఆంజనేయులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గురజాలకు తరలించారు. మృతుని వయసు 35-40 సంవత్సరాలు వుంటుందని పోలీసులు పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు 94407 96236, 93812 98419 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాలబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక



అండర్ - 19 స్కూల్ గేమ్స్ జిల్లా బాలబాలికల హాకీ జట్టు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో మండలంలోని నంది గామ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల హాకీ జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికలకు పాఠశాలలు, కళాశాలల నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు కార్యదర్శి జీ నరసింహారావు తెలిపారు. ఈ జట్లు త్వరలో విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో జరిగే 69వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలలో విద్యా కేంద్రం జూనియర్ కళాశాల పీడీ శివరామకృష్ణ, ప్రిన్సిపల్ మౌలాలి, పీఈటీ గండు సాంబశివరావు, లాకు పిచ్చయ్య, బీ అనీల్ దత్తా నాయక్, తాడికొండ భాస్కరరావు, బోయిన వీరచంద్ర, కాకుమాను సునీత, పీ వాణిసునీల పాల్గొన్నారు. బాలుర జట్టుకు వై చంటిబాబు, ఏ గణేష్, పీ నవీన్, కే సాగర్, షేక్ అమిత్, కే జాన్ విల్సన్, షేక్ రియాజ్, ఎం నీరజ్, ఎస్ కృష్ణమనోహర్, కే సాయిసురేంద్ర, బీ సాయి శ్రీరామ్, జీ ఉదయ్ కిరణ్, పీ శౌరి కిరణ్, టీ జగన్, కే శ్యామ్ కుమార్, ఎం మనోహర్, జే పవన్ కుమార్, స్టాండ్ బైలుగా వై సాత్విక్, షేక్ సర్దార్, షేక్ మొహిద్దీన్ బాషా ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఏ వందన, షేక్ ఉమేరా, పీ లోహిత కృష్ణ కుమారి, టీ ఝాన్సీలక్ష్మి, బీ హారిక, ఆర్ లీలా ప్రసన్న, పీ కోమలి, పీ శ్రీలేఖ, పీ దుర్గా మహేశ్వరి, షేక్ కరిష్మా, ఎం రోహిత సాయి, జీ అమృత వర్షిణి, సీహెచ్ కీర్తి శ్వేత, జీ వర్షిణి, ఓ దీవెన, పీ అక్షయ, ఎం పల్లవి, బీ మానస, స్టాండ్ బైలుగా బీ యోగిత, వై సుష్మిత, సీహెచ్ దివ్య, షేక్ సమీర ఎంపికయ్యారు.

జలజీవన్ మిషన్ పథకంతో ఇంటింటికి కృష్ణా వాటర్

● ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

రెంటచింతల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ప్రతి వార్డులో జేజేఎం ద్వారా గృహాలకు కృష్ణానీటిని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఉప ఎంపీపీ జి.సుమంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆనందపేటలో రూ.84.50 లక్షల వ్యయమయ్యే రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్యాంక్‌లో 90 వేల లీటర్లనీటిని నిల్వ చేయవచ్చని 246 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అలాగే సర్వాసకుంట, అంబేద్కర్ కాలనీ, ఎర్రపాలెం, రేగుల మాన్యానికి రూ.99.87 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని 1107 కుటుంబాల దాహార్తిని కృష్ణా వాటర్ తీర్చనుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి, టౌన్ అధ్యక్షులు ఎం.రాజారెడ్డి, బి రామకృష్ణ, ఎం.శౌరైడ్డి, సైదులు యాదవ్, మర్రి రాజ్‌కుమార్, దండె శివయ్య, నాళం పెద బాబు, బాలస్వామి, దానయ్య పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టీడీపీ నేతలు, అధికారులు

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలి

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ ఎం హనుమంతరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వీఓఏ, సీఆర్పీలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. అసిస్ట్ సీఓ అనిల్ కుమార్ ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. తడిచెత్త ద్వారా సేంద్రియ ఎరువులు, ఘనవ్యర్థాల రీసైక్లింగ్, వాటి ఉత్పత్తిని తగ్గించడం, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, ఏపీఎం, ఏపీవో పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ముప్పాళ్ళ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్

ముప్పాళ్ళ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ ఎస్‌ఐగా పి.అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా ముప్పాళ్ళ వచ్చారు. ముప్పాళ్ళలో ఎస్‌ఐ గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సోమేశ్వరరావు బదిలీలో భాగంగా స్పెషల్ బ్రాంచ్‌కి వెళ్ళారు. మండలంలో అంసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు



350 మందికి ఆధార్ నమోదు

క్రోసూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాల్లో ఇప్పటివరకు 350 మందికి నమోదు చేసినట్టు ఆధార్ అసిస్టెంట్ మేదర రాఘవరాజు తెలిపారు. సోమవారం క్రోసూరు మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. ఆధార్ తప్పు ఒప్పులు, చిరునామా మార్పులు, పుట్టిన తేదీ మార్పులతో పాటు కొత్తగా ఆధార్‌లు నమోదు చేసినట్టు చెప్పారు. మోడల్ స్కూల్‌లో మంగళవారం కూడా కార్యక్రమం జరుగుతుందని, జై భారత్ టెక్నోస్కూల్, సెయింట్ ఆన్స్ స్కూళ్ళల్లో కూడా వచ్చే మూడు రోజుల్లో ఆధార్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పాండునాయక్

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

● విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు పాండునాయక్

విజయపురిసౌత్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్నాడు జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కేతావత్ పాండునాయక్ అన్నారు. జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాండునాయక్ స్థానిక సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. తన ఎంపికకు కృషి చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గిరిజన సంఘ నేత కరంటోత్ పాండునాయక్, మూఢావత్ బాలాజీనాయక్, సోమ్లానాయక్, బీమ్లానాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

పూదోట ఫౌండేషన్ ప్రారంభం

సత్తెనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవలు అందించేందుకు పూదోట ఫౌండేషన్‌ను ప్రారంభించటం అభినందనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో మంగళవారం పూదోట ఫౌండేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సమాజ సేవ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశం, ఉచిత న్యాయ సహాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఫౌండేషన్‌ను ప్రారంభించిన నిర్వాహకులు పూదోట రాజును ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా పూదోట ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు 100మంది యువతీ యువకులు హాజరయ్యారు. వారిలో 40మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, గోగినేని కోటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, నూర్ బాషా జానీబాబు, కోమటినేని, పలువురు న్యాయవాదులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గురజాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఆర్డీవో మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు భారీగా నష్టపోయారన్నారు. తడిసిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నేతలు రెడ్డి శ్రీను, గోపయ్య, జ్ఞానమ్మ, ఆదెమ్మ, మల్లేశ్వరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో మెలకువలు పాటించాలి



పశు వైద్య శిబిరంలో రైతులకు మందులను పంపిణీ చేస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు తదితరులు

దాచేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పశుపోషణలో మెలకువలను పాటించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బీ శ్రీనివాసరావు రైతులను కోరారు. సోమవారం మండలంలోని తక్కెళ్ళపాడులో ఏపీ పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. 70కి పైగా గేదెలకు ఎద పరీక్షలు, గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పశుపోషకులు పాటించి మెరుగైన ఫలితాలను పొందవచ్చని ఏడీ శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ, పశు వైద్యులు నార్ల చెన్నయ్య, కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపందేల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు

కారంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరుల తిరునాళ్ల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యాన ఈనెల 18వ తేదీన కారంపూడిలో ప్రారంభంకానున్న తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్లబండ లాగుడు పోటీల కరపత్రాలను సోమవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, సొసైటీ అధ్యక్షుడు నాగవరపు రామకృష్ణ, విద్యా కమిటి చైర్మన్ బాలునాయక్, శ్రీనివాసయాదవ్, గాడిపర్తి పూర్ణయ్య, పంగులూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ బోర్డు డైరెక్టర్‌గా చినరాజు





పెదకూరపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు, ఇన్‌సెట్‌లో డాక్టర్ చినరాజు

పెదకూరపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ బోర్డు డైరెక్టర్‌గా పెదకూరపాడుకు చెందిన డాక్టర్ గుడిపూడి చినరాజును నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. తనను రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌లకు చినరాజు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ డాక్టర్ సెల్ జిల్లా కార్యదర్శిగా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి చినరాజు కృషి చేశారు.


నరసరావుపేట మండలం గురవాయపాలెంలో బంతిపూల తోట

ఓ వైపు వరుస ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు ధరలు లేక వాణిజ్య పంటలను సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. కొంతమంది రైతులు మాత్రం ఉద్యానవన పంటల సాగుకు శ్రీకారం చుట్టి వాణిజ్య పంటల సాగుకు గుడ్ బై చెబుతున్నారు. ముఖ్యంగా బంతి పూల సాగును చేపట్టి లాభాలు గడిస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి తక్కువ కాకుండా చేసిన కష్టానికి తగ్గట్టుగా అదనంగా ఆదాయం వస్తుందన్న నమ్మకం పూల తోటల సాగులో లభిస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బంతిపూల సాగు భలే బాగు

- ఎకరాకు రూ.లక్ష ఆదాయం
- రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న పంట
- వాణిజ్య పంటల సాగుకు రైతుల స్వస్తి

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో పలు గ్రామాల్లో రైతులు బంతి పూల సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, గోనెపూడి, రావిపాడు, ములకలూరు, పమిడిపాడు గ్రామా లకు చెందిన పలువురు రైతులు బంతిపూలను సాగు చేస్తున్నారు. ఎకరం బంతిపూల సాగుకు దుక్కులు దున్నించిన తర్వాత నారుకు సంబంధించి మొత్తం పదివేల మొక్కలు పడతాయి. ఒక్కో మొక్క రూ. 3 చొప్పున వేయడానికి 30 వేల ఖర్చ వస్తోంది. ఎరువులకు రూ. 25,000, పురుగు మందులకు రూ. 30,000, కూలీలకు రూ. 15,000 ఖర్చులు కలిపి మొత్తం ఎకరానికి రూ.లక్ష వరకు అవుతుంది. మొక్క వేసిన దగ్గర నుంచి 120 రోజుల వ్యవధిలో పూలసాగు పూర్తవుతుంది. భూమిలో మరో పంటను కూడా వేయవచ్చు. మొక్కను నాటిన రెండు నెలల తర్వాత నుంచి పూలు పూతకు వస్తాయి. 60 రోజులపాటు పూల దిగుబడి వరుసగా వస్తూనే ఉంటుంది. తక్కువ మంది కూలీలతో ఎక్కువ పూలను కోసే అవకాశం ఉండటంతో కూలీల కొరతను అధిగమించే అవకాశం ఉంటుంది. ఎకరం పూల తోట నుంచి సుమారు 70 క్వింటాళ్ల వరకు పూల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. సీజన్‌ను బట్టి పూలకు మంచి ధర ఉంటుంది. నాలుగు నెలల వ్యవధిలో బంతిపూల సాగు పూర్తి కావడంతోపాటు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోందని రైతులు తెలి పారు. మార్కెటింగ్ కష్టం లేకుండా పొలం వద్దకే వచ్చి పూలను తీసుకెళ్తుంటారు. కూలీల కొరతను అధిగమించడంతోపాటు రెండు నెలల కాలంలో దిగుబడి పూర్తవడం, ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుండడంతో బంతి పూలసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

నష్టాల నుంచి గట్టెక్కేందుకు పూలబాట

వాణిజ్య పంటలకు స్వస్తి పలికిన రైతులకు బంతి సాగు నష్టాల నుంచి గట్టెక్కించే పూలబాటగా మారింది. పండుగలు శుభకార్యాలతో పాటు కార్తిక మాసంలో భక్తులు ఆచరిస్తున్న వ్రతాలు, ప్రత్యేక పూజలు, దీక్షాపరుల మాలలు ధరించటంతో ప్రతి పూజకు పూలను వినియోగించాల్సి ఉండటంతో పూలకు మంచి గిరాకి ఏర్పడింది. మండపాల అలంకరణలకు కూడా పూల అవసరం ఉండటంతో ప్రస్తుతం కేజీ పూల ధర రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. ఒక ఎకరం బంతి సాగుకు దిగుబడి కాస్త అటు ఇటు అయినప్పటికీ అన్ని ఖర్చులు పోను నమ్మకంగా రూ.లక్ష ఆదాయం మిగులుతుందని రైతులు చెబుతున్నారు.

వేటపాలెం ఎడ్లకు ప్రథమస్థానం


ప్రథమస్థానంలో నిలిచిన బాపట్ల జిల్లా ఎడ్లజత

దుర్గి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో హరిహర బాలనాగేంద్ర స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని సోమవారం నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. న్యూ కేటగిరి విభాగం పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత రెండోస్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం ఎడ్లజత గూడవల్లి లక్ష్మీ దీక్షిత చౌదరి ఎడ్లజత మూడోస్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం వీర్లపాడుకు చెందిన మంగు రమాదేవి ఎడ్లజత నాలుగోస్థానాన్ని, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత ఐదోస్థానాన్ని, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజస్సు మురళి ఎడ్లజత ఆరోస్థానంలో, గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత ఏడోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించగా పోటీలను తులసీ సీడ్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి కృష్ణచైతన్య, పులి హరి, వెలిదండి గోపాలరావు (రిటైర్డ్ ఎల్ఐ), గుండాల వెంకటేశ్వర్లు, కొత్తా వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మయ్య, తోటకూర శ్రీను, వంకమళ్ల కోటేశ్వరరావు, భీమా అమరయ్య, నాగెండ్ల శ్రీను, వెలిదండి శ్రీను, జక్కా ఏడుకొండలు, గోపిలు పర్యవేక్షించారు. మంగళవారం ఆరుపళ్ల విభాగంలో పోటీలు జరగనున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యే యరపతినేని భేటీ

- గురజాల పారిశ్రామిక కారిడార్ గురించి వివరణ

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం పిడుగురాళ్ల అర్అండ్‌బీ బంగ్లాలో యరపతినేని, కలెక్టర్ శుక్లాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పిడుగురాళ్లలో ఉన్న సున్నం పరిశ్రమలన్నింటినీ ఒకేచోట ఏర్పాటు చేసే ఆలోచన గురించి ఇప్ప టికే వ్యాపారులతో మాట్లాడామని, అన్ని పరిశ్ర మలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేస్తే వారికి కావలసిన మౌలిక వసతులు, బ్యాంక్ రుణాల విషయమై ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పామని ఎమ్మెల్యే యరపతినేని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లా డుతూ, యరపతినేని చెప్పే ప్రాజెక్టు విజయ వంతమైతే జిల్లాకే హైలెట్‌గా మారు తుందని, దానికి తన వంతు సహకారం అంది స్తానని పే ర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా మంగళవారం ప్రకాశం జిల్లాలోని కనిగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో ఎంఎస్‌ఎంఏలను ప్రారంభిస్తున్నారని, అందులో భాగంగా దాచేపల్లి సమీపంలోని నడికూడి ఇండస్ట్రియల్ ఏరియాలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన జరగనుందని తెలిపారు. పిడుగురాళ్ల, కోనంకి గ్రామాలలో భూసమస్యలను త్వరగా క్లోజ్ చేయాలని గురజాల ఆర్డీవో మురళీకృ ష్ణను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు.


పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచర్ల కొత్తపల్లిలో సెజ్

- కేంద్రానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆమోదం పొందితే భారీగా పరిశ్రమల రాక

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 పారిశ్రామికవాడలు (ఎస్ఈజెడ్)ల ప్రతిపాదనలను డీపీఐఐటీకి పంపగా వాటిల్లో మాచర్లను కూడా చేర్చింది. వైద్య పరికరాలు, మెడ్-టెక్ ఎస్ఈజెడ్‌గా దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించింది. ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటం కూడా ప్లస్ పాయింట్‌గా మారిం ది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే కొత్తపల్లి మెడికల్ ఫీల్డ్‌కు హబ్‌గా మారుతుంది. అనేక ఫార్మా, వైద్య పరికరాలు తయారు చేసే సం స్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తాయి. దాంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారవర్గాలు తెలిపాయి.

● అభివృద్ధికి బాటలు

పల్నాడు జిల్లాలో మాచర్ల నియోజకవర్గం వెనకబడిన ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంతం కక్షలు, కార్పణ్యాలకు ఒకప్పుడు నిలయంగా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పగలు, ప్రతీకారాలను ఆ పార్టీ నాయకులు పెంచి పోషించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనే ఊసే అక్కడ లేకుండా పోయింది. అటువంటి ప్రాంతంలో ఒక సెజ్‌ను ఏర్పాటు చేస్తే అభివృద్ధికి బాటలు వేసినట్లు అవుతుందని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ద్వారానే మాచర్ల ప్రాంతంలో ఫ్యాక్షనిజాన్ని దూరం చేయొచ్చని విశ్వసిస్తూ మెడ్‌టెక్ సెజ్‌ను ప్రతిపాదించింది. దీనికి కేంద్రం నుంచి తప్పక ఆమోదం లభించే అవకాశాలున్నట్లు సమాచారం. సెజ్ వస్తే అందులో వైద్య, సంబంధిత రంగాల పరిశ్రమలు ఏర్పాటవుతాయి. దాంతో ఆ ప్రాంతానికి రెవెన్యూ సమకూరుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. ఆయా పరిశ్రమలకు వస్తువులు, పరికరాలు సమకూర్చే ఇతర సంస్థల ద్వారా కూడా పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

సీటీ శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన

- కార్యాలయాల్లో నత్తనడకన పనులు
- బాధ్యతా రాహిత్యంగా సిబ్బంది



వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ గుంటూరు నోడల్ డివిజన్ పరిధిలో పలు అధికారుల పోస్టులు ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్నాయి. చాలా కాలం నుంచి ఆయా పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జీ అధికారులు వాటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాంతో సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. కీలకమైన గుంటూరు-2 డివిజన్ మేనేజర్ స్థానం నెలల తరబడి ఖాళీగా ఉంటోంది. అరండల్‌పేట, పట్నంబజార్ డీసీటీవోలు, అలాగే నరసరావుపేట సర్కిల్‌లో ఒకటి, గుంటూరు 2 డివిజన్ కార్యాలయంలో రెండు అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుంటూరు 1 డివిజన్, బ్రా డీపేట, తెనాలి సర్కిల్స్‌లో పని చేసే అసిస్టెంట్ కమిషనర్‌లు ఇప్పటికే పదోన్న తులు పొంది పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే జోన్ 3కి చెందిన జీఎస్‌టీవో పోస్టులు గుంటూరు నగరంలో నాలుగు, కమిషనర్ కార్యా లయంలో మూడు, రీజినల్ కార్యాలయం విజయవాడలో నాలుగు పోస్టులు ఆరు నెలలకు పైగా ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులకు అర్హులైన ఉద్యోగులు పదోన్నతులు లభిస్తాయని ఆశగా ఎదురుచూస్తు న్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు పదోన్నతులు కల్పించాలని ఇప్పటికే ఆ శాఖ ముఖ్య కమిషనర్‌ను పలు ఉద్యోగ సంఘాలు కలిసి కూడా విజ్ఞప్తి చేశాయి. సిటీ శాఖలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరంలో అడ్డగోలుగా చేసిన సంస్కరణల కారణంగా పలువురు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు గత మూడేళ్లగా తమ డివిజన్, జోన్ పరిధి దాటి బయట ప్రాంతంలో పనిచేస్తున్నారు. వారికి డిప్యూటేషన్‌ల అవకాశం కల్పించాలని అనేక దఫాలుగా ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఉన్నతాధికారులు స్పందించాలి

వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా చేసిన సంస్కరణల ఫలితంగా వాణిజ్యపన్నుల శాఖలో పలువురు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల సొంత డివిజన్‌లు, జోన్‌ల పరిధి దాటి వేరొక డివిజన్‌లలో విధులు నిర్వహించటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం డిప్యూటేషన్‌లకు అవకాశం కల్పించాలన్న విజ్ఞప్తులనైనా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అలానే అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి ఇన్‌చార్జీల పాలనకు తెరదీయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

వాటర్ షెడ్ మహోత్సవ్ సభకు సర్వం సిద్ధం

- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

గుంటూరు (తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు లయోలా పాఠశాలలో మంగళవారం జరిగే వాటర్‌షెడ్ మహోత్సవ్ సభకు జిల్లా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వాటర్‌షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొనేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేలు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. తొలుత చెరువును స్వయంగా పరిశీలించి, అ తర్వాత నల్లపాడు లయోలా పాఠశాలలో జరిగే మహోత్సవంతో వారు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సభా వేదికను పరిశీలించి, ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా, వాటర్ షెడ్ మహోత్సవంలో పాల్గొనేందకు విచ్చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అపూర్వ స్వాగతం పలికేం దుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వ ర్యంలో రింగు రోడ్డు నుంచి బైక్, కార్ల ర్యాలీతో ఆయనను సభ వరకు తీసుకువెళ్లేందుకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు.


కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరుకు చేరుకున్న కేంద్ర మంత్రి చౌహాన్

గుంటూరు: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వాటర్ షెడ్ మహోత్సవ్‌లో పాల్గొనేం దుకు గుంటూరు నగరానికి చేరుకున్నారు. సోమవారం రాత్రి ఆయన భువనేశ్వర్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు విమానంలో రాగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అక్కడికి వెళ్లి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌కు చేరుకున్నారు.


24న అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ఎంపికలు

గుంటూరు (క్రీడలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ఏఎన్‌యూలో అండర్ 14,16 బాలికల విభాగంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం బీఆర్ స్టేడియంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీల పోస్టర్‌ను జిల్లా క్రీడల అధికారి అఫ్రోజ్, అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు కృష్ణమోహన్, అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ప్రతిభ గల బాలికలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ కేంద్రాలకు, జాతీయ అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలకు ఎంపికవుతారని తెలిపారు. క్రీడాకారిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారిణులకు ఇది సువర్ణావకాశమని అన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారిణిలకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోపు తమ ఎంట్రీలను యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9666635296 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌కు చెందిన జాతీయ క్రీడాకారుడు పి.వెంకటేశ్వర్లు, జిల్లా అథ్లెటిక్ సంఘం సభ్యుడు ఏవీ ఆంజనేయులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వరరావు, హిందూ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రవి, మాజీ క్రీడాకారుడు ఎస్‌కే మన్సూర్ వలి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద ఉధృతి

- దిగువకు 18,125 క్యూసెక్కుల నీటి విడుదల


ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల, ప్రధాన వాగుల నుంచి 27,587 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవగా.. 18,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 3,709 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 45.56 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 32,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసె క్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూ సెక్కులు, గేట్ల ద్వారా 24,335 క్యూసెక్కుల నీరు, మొత్తం 41,335 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 51,680 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 51,680 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాల ప్రాజెక్టులో 1.0272 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0272 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్ల ద్వారా 22,640 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 8,480 క్యూసెక్కులు మొత్తంగా 31,120 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 32 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

- డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు తెలిపారు. ధాన్యం కొనుగోలుపై గుంటూరు కోర్టు రోడ్డులో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క రైతుకు నష్టం రాకుండా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, కామన్ గ్రేడ్‌కు రూ. 2,369 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి రైతు నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు డీసీఎంఎస్ సంస్థ సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌జీపీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా వినయ్



గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ విభాగం రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు నగరంపాలెంకు చెందిన గంటా వినయ్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఐదు రాష్ట్రాల ఆర్‌జీపీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నగరానికి చెందిన గంటా వినయ్ నాయుడు కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో అనేక పదవులు నిర్వహించారు. అనంతరం ఆర్‌జీపీఆ ర్‌ఎస్ జాతీయ కార్యదర్శిగా తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా వ్యవహ రించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ నాయుడుకు పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పేద బ్రాహ్మణులకు బియ్యం వితరణ

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో సీహెచ్. రఘు మాస్టరు ఇంటి వద్ద 102వ బియ్యం వితరణ కార్యక్రమం జరిగింది నాలుగు నిరుపేద కుటుంబాలకు బియ్యం సంచులను అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ మాధవరావు, మానవ సేవా సమితి అధ్యక్షుడు పీవీ సురేష్‌బాబు, ఎంవీ శర్మ, భువనగిరి సుబ్రహ్మణ్యం, అన్నాప్రగడ వెంకటేశ్వర్లు, గోపాలుని నరేష్, చింతలపూడి భద్రయ్య, గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 148 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 148ఫిర్యాదులు అందాయి. నాదెండ్ల మండలం కనపర్ గ్రామ శివారు మైనంపాడు కాలనీకి చెందిన మణిబాబు చిలకలూరిపేట పట్టణానికి చెందిన షేక్ నాగూర్ వలి, ఫిరోజ్ లు తనకు లోన్ ఇప్పిస్తారని చెప్పి రూ30,000 నగదు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. నరసరావుపేట స్టీఫెన్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం తనకు వర్క్ ఫ్రం హోం అవకాశం ఇప్పిస్తానని తన వద్ద నుంచి నగదు తీసుకున్నాడని తదుపరి మోసంచేసి అతనే తనపై ఫిర్యాదు చేసి తన బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేయించాడని, తగుచర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

వినుకొండ రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి

వినుకొండటౌన్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) వినుకొండ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వేపోలీసులు మృతదేహం వద్ద ఉన్న ఆధార్‌ను పరిశీలించి నరసరావుపేట సమీపంలోని పాలపాడుకు చెందిన జగ్గయ్య (70)గా గుర్తించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లోని మార్చురీకి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

● వినుకొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినుకొండకు చెందిన జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు, జాషువా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, రచయిత కమలారామ్‌కు రితిక ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిత్య, మాజీ మంత్రి పుష్పలీల భారతీయ సేవా పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదులోని రెడ్ హిల్స్ ఎఫ్‌టీసీసీఐ, స్వర్ణ ఆడిటోరియంలో జరిగింది.

● వినుకొండ టౌన్: పట్టణంలోని శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామిదేవస్థానంలో 16వ తేదీన బ్రాహ్మణ వన సమారాధన జరగనుందని సంఘ పెద్దలు తెలిపారు. ఈ మేరకు సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

● వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక సోమవారం వారి భవన ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మానవ సేవా సమితి అధ్యక్షుడు పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పట్టణంలోని కొన్నిప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● నరసరావుపేట టౌన్: పెన్షనర్లుకు, ఫ్యామిలీ పెన్షనర్లుకు బ్యాంకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని ఎస్‌బీఐ మేనేజర్ అమరేంద్ర అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా నరసరావుపేట శాఖ సంఘ భవనంలో ఎస్‌బీఐ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో గొర్రెలు పొలంలోకి రావటంతో సోమవారం గొర్రెల కాపరిపై దాడి జరిగింది. గ్రామానికి చెందిన ముగ్గురు తెలంగాణాకు చెందిన వీరేష్‌పై దాడిచేయటంతో తలకు గాయాలయ్యాయి. నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ స్పాన్సర్డ్ ఆఫ్‌లైన్ ఆరు రోజుల డెవలప్మెంట్ ప్రోగ్రాం జరుగుతుందని డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఏఐ డిపార్ట్మెంట్ ఆఫ్ ఈసీఈ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

● చిలకలూరిపేట: జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ సొసైటీ (గార్డ్), గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన సీపీ బ్రౌన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ వీపీ సుబ్బారావు, జనవిజ్ఞానవేదిక డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.అజయ్ బాబులు పాల్గొని సీపీ బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసినసేవల గురించి వివరించారు.

● చిలకలూరిపేట: మునిసిపల్ కార్యాలయంలో సీపీ బ్రౌన్ జయంతిని మున్సిపల్ చైర్మన్ రఫాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, డీఈరహీమ్ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మార్టిన్ లూథర్ 542వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ నల్లపు మరియదాసు ఆధ్వర్యంలో మార్టిన్ లూథర్ విగ్రహానికి నివాళులర్పించారు.

● చిలకలూరిపేట: స్థానిక సేవాసంస్థ ఒయాసిస్ ఆధ్వర్యంలో కేజే ఆసుపత్రిలో సోమవారం ఉచిత ఎనీమియా, న్యూట్రిషన్ శిబిరం నిర్వహించారు. డాక్టర్ కందిమళ్ళ జయమ్మ ఆధ్వర్యంలో 60 మందికి రక్తపరీక్షలు జరిపి మందులు అందచేశారు.

● చిలకలూరిపేట: స్థానిక నరసరావుపేట సెంటర్‌లో సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ కృతికా శుక్లా


అర్జీదారులలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా , పక్కన ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక ద్వారా వచ్చిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో 132అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కార తీరు ఉండాలని స్పష్టంచేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీ మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టరు సూచించారు. అర్జీలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి మురళి స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

● పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఈద్గా ప్రహరీ అవసరం ఉందని చెప్పగానే మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్ షకీలా వెంటనే తీర్మానం చేసి ఆమోదం ఇవ్వడంపై ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. మదరసాకు రోడ్డు పనులు రెండు నెలల్లోపు పూర్తి చేయాలని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్క అభివృద్ధి పనీ పూర్తికాలేదని విమర్శించారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్ చదువుతున్న ముస్లిం ఆడపిల్లలకు రూ.5000 స్కాలర్‌షిప్ మసీదుల ద్వారా అందిస్తామని జీవీ ప్రకటించారు. మదర్సా అభివృద్ధి కొరకు ముస్లిం మత పెద్దలకు రూ.25,000 చొప్పున అందజేశారు. ఎంపీ సహకారంతో, నారాయణ సహకారంతో, చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రూ. 210కోట్లు వినుకొండ నీటి సమస్య పరిష్కారానికి మంజూరయ్యాయన్నారు. రెండు సంవత్సరాల్లో శాశ్వత నీటి పథకం పూర్తిచేస్తామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ మసీదు 450 సంవత్సరాల చారిత్రక ప్రదేశమని, వినుకొండలో మత సామరస్యానికి గుర్తు అని పేర్కొన్నారు. మత పెద్దల పాత్ర సమాజ నిర్మాణంలో కీలకమని, తప్పులు జరిగితే కఠినంగా ఖండిస్తూ, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తీసుకురావాలన్నారు. గతంలో కొంతమంది వ్యక్తుల ప్రవర్తన వల్ల ముస్లిం కమ్యూనిటీ ప్రతిష్ఠ దెబ్బతిన్నట్లు గుర్తుచేశారు. మత పెద్దలు రాజకీయాలకు అతీతంగా కమ్యూనిటీలో మంచిని పెంపొందించే బాధ్యతను నెరవేర్చాలి అని పిలుపునిచ్చారు. చదువుల కోసం వినుకొండలో ప్రత్యేక ఇంటర్ కాలేజీ ఏర్పాటు విషయాన్ని చంద్రబాబు, లోకేశ్‌తో చర్చించి తప్పకుండా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి కుటుంబం సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మత పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


కార్యకర్త కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులేనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని రెండో వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త రంగా శివ ఇటీవల రోడ్డు ప్రమాదంలో, నరసరావుపేట మండలం రాయపాడు గ్రామానికి చెందిన లాజర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో లాజర్ భార్య కోటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులకు, శివ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల రూపాయల విలువైన చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్యధార రాజు, పౌల్ రాజు, 2వ వార్డ్ టీడీపీ పొత్తూరి శివ ప్రసాద్, పొత్తూరి సురేష్ బాబు, షేక్ సలీమ్, ఏనుగుల ప్రవీణ్, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. నరసరావుపేట మండలం అరవపల్లి నుంచి ఉప్పలపాడు బైపాస్ వరకు పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ గ్రాంట్ నిధులు 60లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నరసరావుపేట లీగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో గడిపూడి సుబ్బారావు, భారతీదేవి దంపతుల గృహంలో చోరీ జరిగింది. వారిని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం పరామర్శించారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, బాధితులకు భరోసా ఇచ్చారు. త్వరితగతిన కేసును దరాప్తుచేయాలని మొదటి పట్టణ సీఐ ఫిరోజ్‌కు ఫోన్‌లో సూచించారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


రుణ వితరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ , వేదికపై ఎంపీ లావు, మక్కెన

వినుకొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. తిమ్మాయపాలెం రోడ్డులోని వైకన్వెన్షన్ హాల్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రుణ వితరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు 650కోట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సామాన్యులకు రుణాలు కావాలంటే సిబిల్‌స్కోర్ బాగుండాలని, మహిళలు సిబిల్ స్కోర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తే అధికమొత్తంలో రుణాలు పొందవచ్చన్నారు బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందిన వారికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తామని బ్యాంకర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహకార బ్యాంక్ ద్వారా రూ.5కోట్లు రుణాలు అందిస్తున్నామని, పెండింగ్ రుణాలను తక్షణమే చెల్లించాలని జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుభాష్, ఎల్‌డీఎం కేఎస్ రాంప్రసాద్, ఆర్ఎం సోమేష్, కౌన్సిలర్ షకీలా బేగం, నాగశ్రీను, బ్యాంక్ అధికారులు, సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక సోమవారం పూజలు


చిలకలూరిపేట: శివపార్వతుల కల్యాణ విశేషాలను వివరిస్తున్న పురోహితులు, ప్రత్యేక అలంకరణలో విప్పర్ల వల్లభేశ్వరస్వామి

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తిక సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ప్రధానంగా మహిళలు వేకువజాము నుంచి భక్తిశ్రద్ధలతో దేవాలయాల్లో స్వామిని సందర్శించి ప్రత్యేక పూజల అనంతరం కార్తిక దీపారాధన వెలిగించారు. పట్టణంలోని బోసుబొమ్మసెంటర్‌లోని శివాలయంతో పాటు అమరేశ్వరాలయం, మంజునాథ దేవాలయం, లలితాంబిక, శ్రీనివాసనగర్‌లోని శివాలయాలు కార్తిక సోమవారం సందర్భంగా కిటకిటలాడాయి.

● నరసరావుపేట రూరల్: కార్తిక మాసం పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు. కోటప్పకొండ, పట్టణంలోని లింగంగుంట్ల అయ్యప్పస్వామి ఆలయంలో, పమిడిపాడు, జొన్నలగడ్డ, ఎలమందల, రావిపాడు, కేతముక్కలఅగ్రహారం, పెద్ద రెడ్డిపాలెం, పెట్లూరు వారి పాలెం, తదితర గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. లింగంగుంట్ల ఎన్ఎస్పీ కాలువ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని కార్తిక దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణోత్సవం

చిలకలూరిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత సంతరోడ్డులో మైత్రీహోమ్స్‌లో సోమవారం కార్తిక సోమవారం సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పురోహితులు గౌరీశంకర్ శివపార్వతుల కల్యాణ విశేషాలను భక్తులకు వివరించారు.

● చిలకలూరిపేట: కార్తిక సోమవారం సందర్భముగా నరసరావుపేట రోడ్డులో గల శ్రీ షిరిడి సాయి బాబా మందిరములో రామడుగు రామకృష్ణశాస్త్రి, పవన్ కుమార్‌శాస్త్రిలు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ చల్లా విజయ్ కుమార్ దంపతులతో ప్రత్యేకంగా మహా శివలింగానికి మహా రుద్రం, పంచామృత అభిషేకాలు, విశిష్టలంకరణతో ధూప దీప నైవేద్య పంచ హారతులతో అష్టోత్తర శతనామావళిపూజా కార్యక్రమం నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా రొంపిచర్లలోని శంకరస్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో కూడా విశేష పూజలు జరిగాయి.

● నరసరావుపేట అర్బన్: నరసరావుపేట పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కామేశ్వర స్వామికి అభిషేకాలను నిర్వహించారు. పూజలను అర్చకులు చతుర్వేదుల భ్రమర కుమార్‌శర్మ నిర్వహించారు.

గుండ్లకమ్మ నదిలో బయటపడిన శివలింగం, నందీశ్వరుడు

● పూజలు చేసిన భక్తులు


గుండ్లకమ్మ నదిలో తంగిరాల సమీపంలో శివ లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

నూజెండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగిరాల సమీపంలో గుండ్లకమ్మ నదిలో రాతిపై చెక్కిన శివలింగం, నందీశ్వరుని విగ్రహాలు ఆదివారం జాలర్లు గుర్తించారు. దీంతో పరిసర గ్రామాల భక్తులు కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చి కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. తంగిరాల సమీపంలో గుండ్లకమ్మ నది రెండు పాయలు చీలిన ప్రాంతంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న నదీ ప్రవాహానికి ఎదురుగా ఉన్న ఏకశిలపై వందల సంవత్సరానికి పూర్వం శివలింగం, నందీశ్వరుని విగ్రహాలు మలిచి ఉంటారని, తాము పుచ్చలగడ్డగా పిలిచే భూమిలో శివలింగం బయటపడిన ప్రాంతంలో ఇసుక మేటలతో కప్పి వేయబడి ఉండేదన్నారు. మొంథా తుఫాన్ ఉధృతికి మేటవేసిన ఇసుక కొట్టుకు పోయి పురాతన శివలింగం, నందీశ్వరుడు బయటపడినట్టు గ్రామస్థులు వివరించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నూజెండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం గర్భిణులకు పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి గర్భిణులు తీసుకోవాల్సిన మందులు, వేయించుకోవాల్సిన వ్యాక్సిన్‌లు, ఆహార నియమాలు, వ్యాయామం తదితర అంశాలను సమగ్రంగా అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఐనవోలు ప్రాథమిక వైద్యశాలలో డాక్టర్ దీపిక, మంజూష 15మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

వేల్పూరు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు బహుమతులు


శ్రీనివాసరావుకు బహుమతులు అందజేస్తున్న బాలోత్సవం ప్రతినిధులు

వేల్పూరు (శావల్యాపురం) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలలో శావల్యాపురం మండలం వేల్పూరు జడ్పీపాఠశాలకు చెందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు జ్యోతి శ్రీనివాసరావు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ సోమవారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ఫోక్ డ్యాన్స్‌లో శ్రీనివాసరావు ద్వితీయస్థానం, మైమ్‌లో తృతీయస్థానాన్ని సాధించినట్లు తెలిపారు. బాలోత్సవం కమిటీపెద్దలు శ్రీనివాసరావును సత్కరించి ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. శ్రీనివాసరావుని జడ్పీటీసీ పారా హైమావతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఎస్ఎంసీ చైర్మన్ దన్నవరపు శ్రీనివాసరావు, హెచ్ఎం మహబూబ్ సుభానీ, వివేకానంద పూర్వవిద్యార్థులకమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.


గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు

జిల్లాలో 11 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో 11 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు వెల్లడించారు. నరసరావుపేట మార్కెట్ యార్డ్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ పత్తివేసిన రైతులు ప్రతి ఒక్క రైతు ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేసుకొని సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా సీసీఐ వారు ఇచ్చిన గైడెన్స్ ప్రకారం ప్రతి రైతు నడుచుకొని తేమశాతం సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక మార్కెట్ యార్డ్ చైర్మన్ పోనాటి శ్రీనివాసరావు, నరసరావుపేట వ్యవసాయ సహాయకులు కేవీ శ్రీనివాసరావు, వినుకొండ వ్యవసాయ సహాయకులు సీహెచ్ రవికుమార్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ దుర్గ ప్రసాద్, చిలకలూరిపేట మార్కెట్ సెక్రటరీ కళావతి, నరసరావుపేట వ్యవసాయ అధికారి ఐ.శాంతి, రొంపిచర్ల, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెళ్ల, బొల్లాపల్లి, వ్యవసాయ అధికారులు, కాటన్ సాగు చేసిన గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలాధారణ స్వాములకు శివశక్తి ఫౌండేషన్ సద్ది వితరణ


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ లీలావతి

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోసుబొమ్మసెంటర్‌లోని పాతశివాలయంలో మాలధారణ చేసిన స్వాములకు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి సద్ది వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో సుమారు 41 రోజుల పాటు మాలధారణ చేసిన స్వాములకు సద్దిని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు.

ఖో ఖో స్టేట్ మీట్‌కి వాగ్దేవి విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు పసుపులేటి తిరుపతమ్మ, బోరుగడ్డ సౌజన్య, షేక్ నజ్మా గుంటూరు జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. వినుకొండ లయోల హై స్కూల్‌లో నవంబరు 8న జరిగిన అండర్ 17 ఎస్‌జీఎఫ్ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో విజయనగరం జిల్లాలో జరగనున్న స్టేట్‌మీట్‌కు గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌లు కట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ ఆంజనేయులు అభినందించారు.

ఖో ఖో, వాలీబాల్ పోటీలలో గీతమ్స్ విద్యార్థుల ప్రతిభ

వినుకొండటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల స్థానిక లయోలా పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14, అండర్ 17 ఖో ఖో, వాలీబాల్ ఆటల పోటీలలో డివిజన్ స్థాయిలో గీతమ్స్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ మాలపాటి కృష్ణవేణి తెలిపారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ అండర్ 14 ఖో ఖో విభాగంలో పి.అభిరామ్, కె.అక్షిత్, ఎం.రంజిత్, అండర్ 14 వాలీబాల్ విభాగంలో సుబ్బారెడ్డి, ఉపేంద్ర నాయక్, వంశీ అర్హత సాధించగా అండర్ 17 ఖోఖో విభాగంలో నక్కసాయి చరణ్‌రెడ్డి, మారెళ్ళ వెంకట అవినాష్‌రెడ్డి అర్హత సాధించగా వాలీబాల్ విభాగంలో ఎల్.ఆనందకుమార్, ఏ విశాల్ రెడ్డి అర్హత సాధించి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు గోపి, సాల్మన్, అజయ్, సుమంత్, సూర్య పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్లో డీపీఎస్ విద్యార్థుల హవా

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూళ్ల చెస్ టోర్నమెంట్‌లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు. నవంబరు 8న గుంటూరు పట్టణంలోని శ్యామల నగర్‌లో నైట్స్ క్యాసిల్ చెస్ అకాడమీ, గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో 6వ తరగతి విద్యార్థిని శ్రావణి అండర్ 11 విభాగంలో 3వ స్థానం సాధించింది. నిఖిల్, సాయి కుందన్‌రాజ్ అండర్-14 విభాగంలో 10వ స్థానం పొంది మెడల్స్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ డా.నాగోతు ప్రకాష్‌రావు డైరెక్టర్ శ్రీమతి నాగోతు సబితా, ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖ ఫులేకర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కోచ్‌లు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సంసిధ్ విద్యార్థులు

కనమర్లపూడి (శావల్యాపురం) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినుకొండలోని లయోలా పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో పోటీల్లో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిధ్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాగర్‌బాబు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఖోఖో పోటీల్లో పాఠశాల విద్యార్థులు అశ్విత్, ప్రవస్థిలు పాల్గొని క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. అనకాపల్లిలో జరగనున్న ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో పోటీలలో అశ్విత్, ప్రవస్థిలు జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన పీడీ నాగరాజును ప్రిన్సిపాల్ సాగర్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా వివేకానంద బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా వివేకానంద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల గ్రామపంచాయతీలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులను నిర్వహిస్తున్న వివేకానందకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి శావల్యాపురం డిప్యూటీ ఎంపీడీవోగా నియమించింది. శావల్యాపురం పంచాయతీ కార్యదర్శి యాకోబు ఇప్పటివరకు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. వివేకానంద ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను కలసి నియామకపత్రాన్ని అందజేసి విధుల్లో చేరారు. కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వివేకానందకు సాదరంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.